సాక్షి మంచిర్యాల

సోమవారం ၊ 22 ၊ ఏప్రిల్ ၊ 2024



కేటగిరీ ప్రమోషన్లకు బ్రేక్! 8లో▸

సింగరేణి ఏటా జనవరి నుంచి డిసెంబర్ వరకు ఇతర కేటగిరీల్లో యాక్టింగ్ చేసిన కార్మికులకు ప్రమోషన్ ఇస్తుంది. ఈసారి ఎన్నికల కోడ్‌తో యాజమాన్యం ఈ ప్రమోషన్లు నిలిపివేసింది.



ఆదాయ పన్ను యాజమాన్యమే చెల్లించాలి 8లో▸

సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య డిమాండ్ చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.4 /28.4

ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జానపద రారాజు 'బిరుదు'



మాట్లాడుతున్న పద్యకవి మలయశ్రీ

మంచిర్యాలఅర్బన్: సాహితి సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బిరుదు రామరాజు శతజయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. పద్యకవి మలయశ్రీ ప్రసంగిస్తూ జానపద రారాజు బిరుదు రామరాజు అని అభివర్ణించారు. సురవరం ప్రతాపరెడ్డి, పీవీ.నరసింహారావు సహచరులని అధ్యాపకులుగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. సాహిత్య సంపదకు పుట్టినిల్లు మడికొండలో జన్మించిన బిరుదు రామరాజు కలం నుంచి తెలుగు వీరుడు లాంటి ఎన్నో చక్కని పుస్తకాలు జాలువారయన్నారు. కార్యక్రమంలో సాహితీ సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వామన్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కవులు శ్రీలక్ష్మి, సంతోష్, సుగుణాకర్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు కవితాగానం చేశారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ జట్ల ఎంపిక



క్రీడాకారులతో అకాడమీ ఫౌండర్ కుమార్

నస్పూర్: జిల్లాస్థాయి యూత్ పురుషులు, మహిళల బాక్సింగ్ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. కుమార్ గన్నర్స్ అకాడమీ ఫౌండర్ ఆర్మీ రిటైర్డ్ అధికారి కుమార్ హాజరై పోటీలకు ప్రారంభించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బోయిన రాజ్‌కుమార్ అభినందించారు. త్వరలో జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు కొట్టె దేవేందర్, కోచ్ రాజేశ్, మహేశ్, సాయికుమార్, గన్నర్ అకాడమీ ఇన్‌చార్జి రమేశ్ పాల్గొన్నారు.

వెల్డర్స్‌కు నోటిఫికేషన్ ఇవ్వాలి



శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

శ్రీరాంపూర్:సింగరేణి ఇటీవల ప్రకటించిన ఇతర ఉద్యోగాల నోటిఫికేషన్లలో ఐటీఐ వెల్డర్ల పోస్టులు కూడా చేర్చాలని వెల్డర్ అభ్యర్థులు కోరారు. గోదావరిఖనిలో ఆదివారం జరిగిన ఐఎన్‌టీయూసీ మహాసభకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబుకు వెల్డర్స్ అభ్యర్థుల ప్రతినిధి శ్రీపెల్లి రాజు వినతిపత్రం అందించారు. సింగరేణిలో ఐటీఐ కోర్సులకు సంబంధించిన పలు ఉద్యోగాలు వస్తాయనే ఆశతో తాము వెల్డర్ కోర్సు చేశామని తెలిపారు. చాలాకాలంగా కంపనీకి వెల్డర్ పోస్టులకు నోటిఫికేషన్ వేయడం లేదని పేర్కొన్నారు. కంపెనీలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల విడుదల చేసిన ఎక్స్‌ట్రనల్ పోస్టుల నోటిఫికేషన్‌లో వీటిని కూడా చేర్చాలని కోరారు.

అబ్బాయిలే పుడుతున్నారు!

- ఏడాదిగా బాలికలతో పోలిస్తే పెరిగిన బాలుర జననం
- బాలికల జననం తగ్గడంపై ఆందోళన
- ప్రైవేటు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలపై అధికారుల దృష్టి



బాలికల రక్షణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



రేడియాలజిస్టులతో గత నెలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మంచిర్యాలటౌన్: జిల్లాలో ప్రస్తుత జనాభాలో పురుషుల కంటే మహిళలే అధికంగా ఉన్నారు. అయితే ఏడాదిగా జన్మిస్తున్న పిల్లల్లో మగవారే ఎక్కువగా ఉంటున్నారు. ఆడపిల్లల జననం తగ్గింది. ఇది ఆందోళన కలిగిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 8,07,037 మంది జనాభా ఉంటే, అందులో పురుషులు 4,08,272 మంది, మహిళలు 3,98,765గా ఉన్నారు. ఆ తరువాత జనాభా లెక్కలను చేపట్టక పోవడంతో, మహిళల సంఖ్య ఎంత ఉందనే దానిపై స్పష్టత లేదు. కానీ ఎన్నికల సమయంలో మహిళా ఓటర్లు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఎక్కువగా ఉండడం, గెలుపోటముల్లో మహిళా ఓటర్లదే ప్రాధాన్యత కనిపిస్తూ వస్తోంది. ప్రస్తుతం జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మొత్తం 6,47,646 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 3,21,248 మంది, మహిళలు 3,26,353 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు పురుషుల కంటే 5,105 మంది ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో అబ్బాయిల కంటే అమ్మాయిల జనాభానే ఎక్కువగా నమోదవుతుందని భావిస్తున్న తరుణంలో గతేడాది పుట్టిన శిశువుల లెక్కలు ఆందోళన కలిగిస్తున్నాయి.

బాలురే ఎక్కువ..

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జిల్లాలో పుట్టిన వారిలో బాలురే ఎక్కువగా ఉన్నారు. ఏడాదిలో మొత్తం 5,756 మంది జన్మించారు. వీరిలో బాలురు 2,886 మంది ఉండగా, బాలికలు 2,870 మంది ఉన్నారు. బాలుర కంటే బాలికల సంఖ్యలో స్వల్ప తేడానే ఉన్నా, రానున్న రోజుల్లో బాలికల సంఖ్య మరింత తగ్గితే, లింగ నిష్పత్తిలో తేడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ-బర్త్ పోర్టల్‌లో పుట్టిన శిశువుల వివరాలతోపాటు, అందులో మగ, ఆడ పిల్లల వివరాలను సైతం గత ఏడాదిగా నమోదు చేస్తున్నారు. ప్రతీనెల ఎంత మంది పిల్లలు జన్మిస్తున్నారు, అందులో మగ, ఆడ పిల్లలు ఎంత మంది ఉంటున్నారనే గణంకాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదవుతున్నాయి.

స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెడితేనే...!

జిల్లాలో కొన్ని ప్రైవేటు క్లినిక్ సెంటర్లలో గుట్టు చప్పుడు కాకుండా అబార్షన్లను చేస్తున్నట్లు తెలుస్తోంది. స్కానింగ్ కేంద్రాలలో పుట్టే బిడ్డ ఆడనా, మగనా తెలుసుకుని, ఆడపిల్లలు ఉంటే అబార్షన్లను చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందుకే బాలికల జననం తగ్గుతుందని భావిస్తున్నారు. భవిష్యత్తులో ఆడపిల్లల జననం ఇలాగే తగ్గితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు స్కానింగ్ సెంటర్లు, ప్రైవేటు క్లినిక్‌లపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. కొందరు కాసులకు కక్కుర్తిపడి, స్కానింగ్‌లో ఆడ, మగ అనే వివరాలు వెల్లడించి ఆడ పిల్లల జననాన్ని అడ్డుకుంటున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో ఉన్న మహిళలు, పురుషులు

2011 ప్రకారం జనాభా 8,07,037	
పురుషులు	4,08,272
మహిళలు	3,98,765
మూడు నియోజకవర్గాల్లోని మొత్తం ఓటర్లు, మహిళలు, పురుషులు	
మొత్తం ఓటర్లు	6,47,646
పురుషులు	3,21,248
మహిళలు	3,26,353
2023, ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు పుట్టిన శిశువుల వివరాలు	
మొత్తం శిశువులు	5,756
పుట్టిన బాలురు	2,886
పుట్టిన బాలికలు	2,870

నిఘా పెట్టాం



జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల్లో ఆడ, మగ అనే వివరాలు వెల్లడించొద్దని గతనెల 21వ తేదీన రేడియాలజిస్టులతో సమావేశం ఏర్పాటు చేసి ఆదేశించాం. అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు, ప్రైవేటు ఆసుపత్రులకు ఈమేరకు ఉత్తర్వులు కూడా జారీ చేశాం. జిల్లాలో స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందలేదు. తమ దృష్టికి వస్తే చట్టప్రకారంగా చర్యలను తీసుకుంటాం.

– డాక్టర్ సుబ్బరాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచాలి



నిరసన తెలుపుతున్న సింగరేణి రిటైర్డ్ కార్మికులు

మంచిర్యాలటౌన్:సింగరేణి విశ్రాంత కార్మికుల కనీస పెన్షన్‌ను రూ.వెయ్యికి పెంచడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని, కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచాలని రిటైర్డ్ కార్మికులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. ఇటీవల సీఎంపీఎఫ్ ట్రస్టు బోర్డు, కేంద్ర ప్రభుత్వం బొగ్గు గని విశ్రాంత కార్మికులకు కనీస పెన్షన్ రూ.వెయ్యి పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 1998లో కోల్ ఇండియా యాజమాన్యం 5వ జాతీయ కార్మిక సంఘాలు చేసుకున్న ఒప్పందం మేరకు మార్కెట్‌లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మూడేళ్లకోసారి కోల్‌మైన్స్ పెన్షన్‌ను పెంచాలన్నారు. 25 ఏళ్ల తర్వాత కేవలం రూ.వెయ్యిగా నిర్ణయించడం అన్యాయమన్నారు. సమావేశంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షుడు రాజన్న, నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, కె.బాబు, చంద్రయ్య, టి.మల్లేశ్, సత్యనారాయణమూర్తి, సూర్యనారాయణగౌడ్, కె.ప్రకాశ్, టి.రాజన్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు 'ఏకలవ్య' విద్యార్థులు

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మహారాష్ట్రలోని ముంబాయిలో నిర్వహించే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఉపేందర్, పీఈటీ అనూష తెలిపారు. పాఠశాల విద్యార్థులు కే.హిందు(ఏడో తరగతి), విజ్ఞాన్ (ఎనిమిదో తరగతి) ఈనెల 21 నుంచి 24 వరకు ముంబాయి నిర్వహించనున్న హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పైసలిస్తున్నం.. ఎట్ల పట్టుకుంటరు!



తాండూర్ పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్మగ్లర్ల కుటుంబీకులు

- రచ్చకెక్కిన పోలీసుల 'మామూళ్ల' దందా
- గుట్టు విప్పిన పీడీఎస్ రైస్ స్మగ్లర్ల కుటుంబీకులు
- తాండూర్ ఠాణాకు వెళ్లి పోలీసుల నిలదీత
- ఘటనపై ఉన్నతాధికారుల ఆరా

బెల్లంపల్లి: తాండూర్ పోలీసు స్టేషన్ సాక్షిగా రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్న స్మగ్లర్లు, వారి కుటుంబీకులు రెచ్చిపోయారు. నెలవారీ మామూళ్ల గుట్టు విప్పారు. పైసలు ఇస్తున్నా.. బియ్యాన్ని ఎట్ల పట్టుకుంటరని నిలదీయడం బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో చర్చనీయాంశమైంది. ఇన్నాళ్లు గుట్టుగా సాగుతున్న 'మామూళ్ల ' వ్యవహారం ఇప్పుడు రచ్చకెక్కింది. ఈ చర్య రేషన్ బియ్యం స్మగ్లర్లు, పోలీసుల మధ్య ఉన్న బంధాన్ని బహిర్గతం చేసింది. రేషన్ బియ్యం అక్రమదందాపై ఉక్కుపాదం మోపడానికి పోలీసు ఉన్నతాధికారులు పనిచేస్తుంటే.. బెల్లంపల్లి సబ్ డివిజన్ పోలీసులు అంతా 'మామూలు'గా చూస్తున్నట్లు తాజా వ్యవహారంతో నిర్ధారణ అయిందన్న చర్చ జరుగుతోంది.

ఏం జరిగిందంటే...

రేషన్ బియ్యం అక్రమ దందా సాగిస్తున్న స్మగ్లర్లు కొందరు శనివారం ఆటోలో బియ్యాన్ని ఓ అడ్డాకు తరలిస్తుండగా తాండూర్ పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారంతో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మాటు వేసి పీడీఎస్ రైస్ రవాణా చేస్తున్న ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటో డ్రైవర్ కొల్లూరి శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న స్మగ్లర్లు.. తాము బియ్యం తరలిస్తున్నట్లు తాండూర్ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు భావించారు. మూకుమ్మడిగా శ్రీనివాస్ ఇంటికి వెళ్లి అతడిపై దాడికి యత్నించారు. చాకచక్యంగా తప్పించుకున్న శ్రీనివాస్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద రచ్చ..

శ్రీనివాస్ తాండూర్ పోలీస్ స్టేషన్‌లో ఉన్నట్లు తెలుసుకున్న స్మగ్లర్లు, వారి కుటుంబ సభ్యులు ఠాణాకు చేరుకున్నారు. శ్రీనివాస్‌ను తమకు అప్పగించాలని మొదట డిమాండ్ చేశారు. శ్రీనివాస్ తమ వద్ద లేడని చెప్పడంతో తమ బియ్యం ఎందుకు ప ట్టుకున్నారని ఎస్సైతోపాటు పోలీసులను బియ్యం స్మగ్లర్ల కుటుంబ సభ్యులు ఫజానా బేగం, అమీనా బేగం, టీనా బేగం తదితరులు నిలదీశారు. నెలవారీగా ముడుపులు ఇస్తున్నాం కదా అని ప్రశ్నించారు. ఈ నెల రంజాన్ కారణంగా ఆలస్యమైందని, ఆమాత్రానికే ఎలా పట్టుకుంటారని నిలదీశారు. దీనిపై పోలీసులు నోరు మెదపకపోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

ఆందోళనకారులపై కేసు..

గొడవ పెరగడం, పోలీసులపై స్మగ్లర్ల కుటుంబ సభ్యులు తిరగబడడంతో పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన పోలీసులు తమ విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా, ఎర్ర శ్రీనివాస్‌ను పోలీసులు వెనకేసుకు రావడం కూడా ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

ఉన్నతాధికారుల ఆరా..

ఇదిలా ఉండగా, పీడీఎస్ బియ్యం స్మగ్లర్లు పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులను నిలదీయండం, నెలనెలా మామూళ్లు ఇస్తున్నామని బహిరంగంగానే ఆరోపించిన వ్యవహారం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఈమేరకు వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో తాండూర్ ఠాణా ఘటనపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

స్మగ్లర్ల మధ్య విభేదాలు?

రేషన్ బియ్యం అక్రమ దందా చేస్తున్న స్మగ్లర్ల మధ్య విభేదాలతోనే ఈ వ్యవహారం ఇప్పుడు చర్చకు ఎక్కింది. దందా నిర్వహించే ఓ వ్యక్తి పోలీసులతో సన్నితంగా మెలగుతూ ఇతరుల సమాచారం చేరవేస్తున్నరని మిగతావారు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల బెల్లంపల్లిలో పోలీసులు రేషన్ బియ్యం పట్టుకుంటున్నారని చెబుతున్నారు. ఆ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తే తాజా ఘటన కు కారణమయ్యాడని స్మగ్లర్లు పేర్కొంటున్నారు.

ఆ క్వార్టర్లు ఏం చేస్తారో?

- త్వరలో మూతపడనున్న ఆర్కేపీ ఓపెన్‌కాస్ట్
- రామకృష్ణాపూర్ వ్యాప్తంగా 3 వేల సింగరేణి క్వార్టర్లు
- ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు 15 శాతమే
- మిగిలినవి ఏం చేస్తారో చెప్పని యాజమాన్యం



ఆర్‌కేపీలోని సీ-2 క్వార్టర్లు

రామకృష్ణాపూర్: సింగరేణి భూగర్భ బొగ్గు గనులు, వాటిలో పనిచేసే వందలాది మంది కార్మికులతో ఒకప్పుడు కళకళలాడిన మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఇప్పుడు కళ తప్పుతోంది. ఇప్పటికే భూగర్భ గనులు మూత పడగా... ఉన్న ఒక్క ఓసీపీ మరో ఏడెనిమిది నెలల్లో మూతపడనుంది. దీంతో ఏరియాలోని సింగరేణి ఆస్తులను యాజమాన్యం ఏం చేస్తుందన్న ప్రశ్న తలెత్తుతోంది. కార్మికుల కోసం పట్టణంలో సంస్థ నిర్మించిన 3 వేల క్వార్టర్లను యాజమాన్యం ఏం చేస్తుందన్న చర్చ జరుగుతోంది.

వేల క్వార్టర్ల నిర్మాణం..

రామకృష్ణాపూర్ ఒకప్పుడు ప్రత్యేక డివిజన్‌గా ఉండేది. రెండు దశాబ్దాల క్రితం వరకు గనులు, కార్మికులతో శోభిల్లిన చరిత్ర ఈపట్టణానిది. కాలక్రమేణా భూగర్భ గనులు మూతపడ్డాయి. గనులు, డిపార్ట్‌మెంట్లు, చివరికి జనరల్‌మేనేజర్ పోస్టుతోపాటు ఏరియానే ఎత్తివేశారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా వివిధ టైపుల క్వార్టర్లను సంస్థ నిర్మించింది. ఏ టైప్, బీ టైప్, సీ టైప్, డీ, టైప్‌తోపాటు స్పెషల్, ఏ, స్పెషల్ సీ, స్పెషల్ డీ, షిర్కే, నాగార్జున క్వార్టర్స్ ఇలా వివిధ రకాల క్వార్టర్లు 3 వేల పైచిలుకు ఉన్నాయి. గనుల మూసివేత, ఇతర ప్రాంతాలకు కార్మికుల బదిలీ, మరికొందరు రిటైర్ కావడంతో ప్రస్తుతం 15 శాతం మంది కార్మికులే పట్టణంలో మిగిలారు. క్వార్టర్లలో ఈ 15 శాతం మందితో పాటు మిగతా వాటిలో కొంతమంది రాజకీయ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, వారి బంధువులు, ఇతర ప్రైవేటు వ్యక్తులు నివసిస్తున్నారు. సంస్థ కార్మికులను పక్కనపెడితే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉన్న క్వార్టర్లను ఏం చేస్తుందో స్పష్టత ఇవ్వడం లేదు.

ప్రతిపాదనలు ఏంటి..

రామకృష్ణాపూర్‌లో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు మూసివేసిన తర్వాత మిగిలేది బి-జోన్ ఏరియా ఆసుపత్రి, సివిల్ డిపార్ట్‌మెంట్, సీహెచ్‌పీ మాత్రమే. దీంతో కార్మికుల్లో చాలా మంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తారు. దీంతో మరిన్ని క్వార్టర్లు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 2 వేలకుపైగా క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. వీటిలో చాలా వరకు శిథిలావస్థకు చేరాయి. వాటిని కూల్చివేస్తారా లేక అద్దె ప్రాతిపదికన ఎవరికైనా కేటాయిస్తారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రిటైర్డ్ కార్మికులకు ఇవ్వాలని కోరుతుండగా, మరికొందరు కంపెనీ అద్దె నిర్ణయించి ప్రైవేటుకు ఇవ్వాలని కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాలి

రామకృష్ణాపూర్‌లో ఉన్న కంపెనీ క్వార్టర్లు రిటైర్డ్ ఉద్యోగులకు కేటాయించాలి. ఈ విషయమై త్వరలోనే యాజమాన్యంతో మాట్లాడుతాం. క్వార్టర్లు వృథాగా ఉంచటంకన్నా సంస్థకు ఎన్నో ఏళ్లు సేవలందించిన కార్మికులకు ఇవ్వడం మంచిది.

– వాసిరెడ్డి సీతారామయ్య, గుర్తింపు సంఘం అధ్యక్షుడు

బీజేపీతోనే అభివృద్ధి

వేమనపల్లి:కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్ కోసం జరిగే ఎన్నికలన్నారు. నరేంద్ర మోదీని మళ్లీని ప్రధానిని చేయాలని కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రాభరి సుదర్శన్‌గౌడ్ , మండల ఇన్‌చార్జి శ్రీకృష్ణదేవరాయులు, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీదే అధికారం..

భీమారం:పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ మరోమారు కేంద్రంలో అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ అన్నారు. భీమారం మండలం అంకుసాపూర్‌లో బీజేపీ తరఫున ఆదివారం ప్రచారం నిర్వహించారు. దేశం కోసం ప్రధాని మోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. ప్రపంచంలో భారత దేశానికి ప్రత్యేక గౌరవం తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందులో మండల ఇన్‌చార్జి ఆలం బాపు, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజేశ్, మాడెం శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో బీజేపీ నాయకులు

నస్పూర్‌లో ఇంటింటికీ బీజేపీ ప్రచారం

నస్పూర్: పెద్దపెల్లి బీజేపీ తరఫున పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు ఆధ్వర్యంలో నస్పూర్ పట్టణంలో ఆదివారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని బలపరచి మూడోసారి మోదీనే ప్రధానిని చేయాలని కోరారు. పెద్దపెల్లి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సత్రం రమేశ్, కమలాకర్‌రావు, ఆనంద్‌కృష్ణ, పానుగంటి మధు, సదానందం, కర్రీ చక్రి, రమేశ్, భీమ్‌నాయక్ పాల్గొన్నారు.

'వ్యాపారాలు కాపాడుకోవడానికే రాజకీయాల్లోకి'

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

బెల్లంపల్లి:వ్యాపార సామ్రాజ్యాన్ని కాపాడుకోవడం కోసమే మాజీ కేంద్ర మంత్రి గడ్డం వెంకటస్వామి కుటుంబం రాజకీయాల్లో కొనసాగుతోందని, ప్రజలకు సేవ చేయడానికి కాదని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. బెల్లంపల్లిలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటస్వామి కుటుంబంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఏడు దశాబ్దాలకుపైగా పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో దళితులు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఆ కుటుంబమే రాజకీయంగా ఎదిగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం కాకా కుటుంబం జాగీరు కాదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ప్రజల బాధలు తెలియవన్నారు. సంపన్న కుటుంబం నుంచి వచ్చిన వంశీకృష్ణను ఓడించాలని కోరారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సింగరేణిలో సాధారణ కార్మికుడిగా పనిచేసిన తనకు ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారని తెలిపారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజా గొంతుకవుతానని పేర్కొన్నారు. వీకెండ్‌లా వచ్చే చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్, వినోద్ ప్రజలకు సేవ చేయరని విమర్శించారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్‌ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పక్కన మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

కాంగ్రెస్ గెలుపునకు కష్టపడాలి



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, పక్కన ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్

బెల్లంపల్లి:పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి స్థానంలో కార్యకర్తలు కష్టపడి పనిచేసి వంశీకృష్ణను ఎంపీగా గెలిపించాలని బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్ కోరారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణతోపాటు ఇరువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురా వాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణకు ప్రజా సమస్యలపై అవగాహన ఉందన్నారు. యువకుడు, ఉత్సాహ వంతుడైన వంశీని గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్, బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మాజీ చైర్మన్ సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు కారుకూరి రాంచందర్, బండి ప్రభాకర్, మునిమంద రమేష్, దావ రమేష్, నాతరి స్వామి, మల్లారపు చిన్నరాజం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


జుమ్మిడి కిరణ్(ఫైల్)

దహెగాం(సిర్పూర్): కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దహెగాం మండలం పెసరికుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెసరికుంట గ్రామానికి చెందిన జుమ్మిడి కిరణ్(27) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రతరం కావడంతో శనివారం ఉదయం బహిర్భూమి కోసం స్థానిక వాగు వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కిరణ్‌ను మొదట కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఉదయం మంచిర్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

రామకృష్ణాపూర్: పట్టణంలో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో బయటకు రావడానికి కూడా ప్రజలు జంకుతున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారుజామున రామాలయం చౌరస్తాలో కుమ్మం సురేందర్‌తోపాటు మరో వ్యక్తిపై దాడిచేసి గాయపర్చాయి. స్థానికులు కుక్కలను బెదిరించి తీవ్రంగా గాయపడిన సురేందర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆయన కుడికాలుకు నాలుగు కుట్లుపడ్డాయి. కుక్కల బెడద ఉన్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన ఆటో డ్రైవర్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై కల్వరి మినిస్ట్రీ వద్ద ఆగి ఉన్న ఆటోను ఆర్టీసీ బస్సు ఆదివారం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. సోమగూడెం నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఆటో ప్రయాణికులను దించి నిలిపి ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఉండి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

చెన్నూర్: పట్టణ సమీపంలోని అస్నాద ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు మైనింగ్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోటపల్లి మండలం నుంచి చెన్నూర్‌కు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కేటగిరీ ప్రమోషన్లకు బ్రేక్!

- ఎన్నికల కోడ్‌తో నిలిపివేత
- కార్మికుల్లో ఆందోళన
- ఎన్నికల అధికారిని కలిసిన గుర్తింపు సంఘం నాయకులు


ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ప్రతీ మార్చిలో ఇచ్చే కేటగిరీ ప్రమోషన్లు ఈసారి నిలిచిపోయాయి. దీంతో ప్రమోషన్లు పొందే కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటా జనవరి నుంచి డిసెంబర్ వరకు ఇతర కేటగిరీల్లో యాక్టింగ్ చేసిన కార్మికులకు ఖాళీల ఆధారంగా ప్రమోషన్లు ఇస్తారు. సంవత్సరంలో కనీసం 150 యాక్టింగ్ మస్టర్లు చేసి ఉంటే ఆయా కేటగిరిల్లో ఖాళీల ఆధారంగా జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు చివరి మూడు సంవత్సరాల యాక్టింగ్‌లను పరిగణలోకి తీసుకుని ప్యానల్ లిస్టు తయారు చేసి ఈ కేటగిరీ ప్రమోషన్లు అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకైతే కనీసం 75 యాక్టింగ్ మస్టర్లు ఉంటే చాలు. ఐతే ఈసారి ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం ఈ ప్రమోషన్లు నిలిపివేసింది. కంపెనీ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

ఎన్నికలకు ముందే జాబితా..

ఇదిలా ఉంటే ఎన్నికల కోడ్‌కు ముందే ప్రమోషన్ల లిస్టును అధికారులు తయారు చేశారు. ఏరియాల జీఎంల కార్యాలయాల నుంచి అన్ని గనులు, డిపార్టుమెంట్లకు ఈ లెటర్లు సైతం బట్వాడా అయ్యాయి. కానీ వీటిని పంపిణీ చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో యాజమాన్యం వీటి పంపిణీ నిలిపివేసింది. దీంతో కంపెనీ వ్యాప్తంగా సుమారు 600 మంది ఈ ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

గతంలో ఇలాంటిది లేదు..

ఇదిలా ఉంటే సింగరేణిలో ఏటా కేటగిరీ ప్రమోషన్లు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఎప్పుడు కూడా ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం వీటిని ఆపలేదని కార్మిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. సింగరేణి ఓ ప్రభుత్వరంగ సంస్థ, ఈ ప్రమోషన్లు కొత్తగా వచ్చిన హక్కు కాదని, ఎన్నో ఏళ్లుగా ఉన్న వాటిని యాజమాన్యం కోడ్‌తో ముడిపెట్టి ఆపడం సరికాదంటున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా కూడా ఈప్రమోషన్ పత్రాలను మ్యాన్‌వేలపై కార్మికుల చేతికి అధికారులు అందించినా ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు. గనులపై కార్యక్రమాలు చేపట్టి ట్రేడ్‌యూనియన్, రాజకీయ పార్టీల నేతలు పిలిచి లెటర్లు ఇస్తేనే కోడ్ కిందికి వస్తుందని అభిప్రాయ పడుతున్నారు.

ఎన్నికల అధికారికి వినతి..

కేటగిరీ ప్రమోషన్లు నిలిపివేయంపై ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను హైదరాబాద్‌లోని ఎన్నికల కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో ఈ ప్రమోషన్లు రొటీన్‌గా జరుగుతాయని, ఎన్నికల కోడ్‌కు దీనికి సంబంధం లేదని తెలిపారు. గతంలో ఏ ఎన్నిక సందర్భంగా ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేదని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. రెగ్యులర్‌గా ఇచ్చే ప్రమోషన్లను ఎన్నికల కోడ్‌తో ముడి పెట్టి యాజమాన్యం పంపిణీ ఆపేసిందని తెలిపారు. దీనిపై యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

ఆదాయ పన్ను యాజమాన్యమే చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య
- నాయకులకు శిక్షణ తరగతులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్‌లో యూనియన్ నాయకులకు ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ కోలిండియాలో ఉద్యోగులకు, సింగరేణిలో అధికారులకు సైతం పెర్క్స్‌పై ఆదాయ పన్నును యాజమాన్యమే చెల్లిస్తుందన్నారు. సింగరేణిలో కార్మికులు కూడా కంపెనీనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం గనులపైకి వచ్చే పార్టీల నాయకులు ఈ రెండు ప్రధాన హామీలను నెరవేరుస్తామని హామీ ఇస్తేనే ఓట్లేస్తామని కార్మికులు తేల్చి చెప్పాలన్నారు. అప్పుడే వీటిని సాధించుకుంటామన్నారు. ఎంపీ ఎన్నికల విధులు నిర్వహించే సింగరేణి ఉద్యోగులకు ఎన్నికల విధుల రోజులను కంపెనీ స్పెషల్ లీవ్‌గా ఇస్తుందని, దీనివల్ల ఉద్యోగులు నష్టపోతారని పేర్కొన్నారు. ఎన్నికల విధులకు హాజరైన వారికి ఓడీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కంపెనీ గత సంవత్సరం 70 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిని సాధించి రికార్డు నెలకొల్పిందన్నారు. దీనికి కారణమైన ఉద్యోగులకు వెండి లేదా బంగారు నాణెం కానుకగా ఇవ్వాలని కోరారు. దీంతో కార్మికులు ఉత్సాహంగా పనిచేసి 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా అవలీలగా సాధిస్తారని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ చాలా గనుల్లో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను నడిపిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వాటిస్థానంలో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడిచినా ఇప్పటికీ తమకు గుర్తింపు పత్రం ఇవ్వలేదని తెలిపారు. మార్చిలో ఇచ్చే కేటగిరీ ప్రమోషన్లను ఎన్నికల కోడ్ పేరుతో నిలిపివేశారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసఫ్, ప్రొఫెసర్ నర్సింహారావు, సింగరేణి రిటైర్డ్ డీజీఎం శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా డీవైసీఎంవో రమేశ్‌బాబు కార్మిక ఉద్యమం, నాయకత్వ లక్షణాలు, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్స్, లౌకికవాదం, రిటైర్డ్ కార్మికులకు రావలసిన బెనిఫిట్స్, మైన్స్ రూల్స్, వృత్తి పరమైన ఆరోగ్య సమస్యలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా ప్రజా సంఘాల నిర్మాణం

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

పాతమంచిర్యాల: ప్రజా సంఘాలను పటిష్టంగా నిర్మించుకోవాలని, పార్టీ నిర్మాణ వ్యతిరేకులను, విచ్ఛిన్నకారులను తిరస్కరిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొందరు వ్యక్తిగతంగా పోటీ కమిటీల నియామకాలు చేస్తున్నారని అన్నారు. ఈ కమిటీల నిర్మాణం పార్టీ నిర్మాణ పద్ధతులకు వ్యతిరేకమని తెలిపారు. ఆ కమిటీలు చెల్లవని స్పష్టం చేశారు. పోటీ కమిటీలో ఉన్న వ్యక్తులను సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నిర్మాణంలో ఉన్న అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన గోపీనాథ్, కాంతారావును పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. వారు ఐఎఫ్‌టీయూ నియమాలకు, నిర్మాణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మేకల రామన్న, ఎదునూరి రమేశ్, దేవయ్య, సారయ్య, ఖలీల్, రాజేశ్వర్‌రావు, సురేందర్, ఎండీ.షాహీద్, ప్రభంజన్ పాల్గొన్నారు.

బెంగళూరు వెళ్లిన తలసేమియా పిల్లలు


మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న తలసేమియా పిల్లలు, వారి తల్లిదండ్రులు

మంచిర్యాలటౌన్:తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలు మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ బెంగళూరు వారి సహకారంతో భగవాన్ మహావీర్ జైన్ హాస్పిటల్‌కు ఆదివారం వెళ్లారు. బోన్ మారో మార్పిడి నిమిత్తం ముందస్తు వైద్య పరీక్షల కోసం ఆరుగురు పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులను మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి రైలులో బెంగళూరుకు పంపినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల హెచ్‌ఎల్‌ఏ క్యాంపు నిర్వహించగా, రిపోర్టులో 9 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబ సభ్యులతో రిపోర్టులు సరిపోలడంతో బెంగళూరు ఆసుపత్రికి పంపించామని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బోన్ మారో మార్పిడి చేయించడం జరుగుతుందని వెల్లడించారు. బోన్ మారో మార్పిడితో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధులు పూర్తిగా నయమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, ముల్కల్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

దుబాయ్‌లో మనోళ్లు భద్రమేనా!


దుబాయ్‌లో నీటమునిగిన తెలుగువారు ఉండే ఓ ప్రాంతం

- భారీవర్షాలతో గల్ఫ్‌దేశం అతలాకుతలం
- ఆందోళనలో గల్ఫ్ కార్మిక కుటుంబాలు
- సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు
- లైఫ్‌గార్డ్ బృందంలో నిర్మల్‌వాసి సందీప్


వరదనీటిలో చిక్కుకున్నవారిని బయటకు తెస్తున్న బృందంలో సందీప్

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ దేశమైన దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని భారీ వర్షాలతో అక్కడిజనం అతలాకుతలమవుతున్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. వాటిని చూస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా నుంచి వేలసంఖ్యలో ఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. దుబాయ్‌లో కుండపోత వర్షాల కారణంగా జనం సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నట్లు సమాచారం. దుబాయ్‌లోగల లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీటమునిగాయి. దాదాపు ఆరడుగుల లోతున్న వరద నీటిలో ఇరుక్కుపోయిన వారిని పడవలు, బోట్లు, సహాయకబృందాల ద్వారా బయటకు తీసుకువస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ వాసి పాతర్ల సందీప్ 'సాక్షి'తో ఫోన్‌లో తెలిపారు. దుబాయ్ డీపీ- 1 గ్రీన్ కమ్యూనిటీలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్ అక్కడి విపత్తు నిర్వహణాధికారుల ఆదేశాల మేరకు వరద నీటిలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా ప్రాంతాల్లోని కార్మికులను కూడా బృందాలుగా ఏర్పడిన లైఫ్‌గార్డ్స్ ప్రాణాలకు తెగించి నీటమునిగిన వారిని బయటకు తీస్తున్నట్లు వివరించారు. నాలుగురోజులుగా విపరీతంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించినట్లు వివరించారు.

ప్రశంసలు పొందుతున్న జిల్లావాసి..

నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన పాతర్ల సందీప్ దుబాయ్‌లోని గ్రీన్ కమ్యూనిటీ ప్రాంతంలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో భాగంగా అక్కడిబృందంలో నిర్వహిస్తున్న విధులకుగాను అధికారులు ఇతడిని ప్రశంసిస్తున్నారు. జిల్లావాసులు కూడా అతడు అందిస్తున్న సేవలు తెలుసుకుని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

'మిసెస్ వరల్డ్'కు డాక్టర్ చంద్రిక



డాక్టర్ చంద్రిక

నిర్మల్: మిసెస్ వరల్డ్–ఇంటర్నేషనల్ ఫైనల్ పోటీలకు జిల్లాకేంద్రానికి చెందిన వైద్యురాలు చంద్రిక ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఇందులో సెల్ఫ్ ప్రజెంటేషన్, ఇంట్రడక్షన్, ఇంటర్వ్యూ తదితర రౌండ్లలో ప్రతిభ కనబర్చారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి చేపట్టిన ఆడిషన్స్‌లో ఆమె ఫైనల్‌కు ఎంపికయ్యారు. గురుగ్రామ్‌లో జూన్ ఒకటిన ఫైనల్ పోటీలుంటాయని చంద్రిక తెలిపారు. నిర్మల్ నుంచి తాను ఇక్కడిదాకా రావడానికి తన భర్త డాక్టర్ అవినాష్, అత్తమ్మ దేవీబాయి సహకారమే కారణమని పేర్కొన్నారు.

ప్రశాంతంగా టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 4,437 మంది హాజరు


పరిశీలిస్తున్న ఆర్‌సీవో గంగాశంకర్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(టీఎస్‌ఆర్‌జేసీ)ల్లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,506 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని 23 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,437 మంది హాజరయ్యారు. 1,069 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను టీఎస్‌ఆర్‌జేసీ రీజినల్ కో ఆర్డినేటర్ గంగాశంకర్ పరిశీలించారు. ఇందులో ప్రతిభ ఆధారంగా విద్యార్థుకు ఉమ్మడి జిల్లాలోని రెండు టీఎస్‌ఆర్‌జేసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో 88 సీట్లు, బెల్లంపల్లిలోని బాలుర కళాశాలలో 88 సీట్లు ఉన్నట్లుగా ఆర్‌సీవో వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మంచిర్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని లక్ష్మీ టాకీస్ చౌరస్తాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన బత్తుల సత్తయ్య (50) పాల వ్యాపారం చేస్తున్నాడు. రోజూలాగానే పాలు విక్రయించేందుకు మంచిర్యాలకు వచ్చాడు. లక్ష్మీ టాకీస్ వద్ద ఓ హోటల్‌లో పాలు పోసి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య చికిత్స పొందుతున్నాడని ఎస్సై తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గాలివానకు తీవ్ర నష్టం


ధ్వంసమైన నవేగూడ పాఠశాల డైనింగ్ హాల్

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. నవేగూడ, చించోలీ, ఎనోలీ, కొలాంగూడతోపాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నవేగూడలో గుర్నులే ఉద్ధుడుకు చెందిన ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. స్థానిక ప్రభుత్వ పాఠశాల డైనింగ్ హాల్ పూర్తిగా ధ్వంసమైంది. మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చించోలీలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడగా పాటగూడ పంచాయతీ పరిధిలోని ఎనోలీ కొలాంగూడలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నివాస గృహాలు ఈదురు గాలులకు దెబ్బతిన్నాయి. నాసిరకంగా ఏర్పాటు చేసిన రేకులు గాలి ధాటికి ఎగిరిపోయాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.


కూలిన ఇల్లు


ఒరిగిన విద్యుత్ స్తంభం

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- టాటా ఏస్, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీ
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..
- ఆదిలాబాద్ జిల్లా సుంకిడి వద్ద ఘటన


బోల్తా పడిన వాహనాలు

తలమడుగు: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సోమతానా గ్రామానికి చెందిన 16 మంది శనివారం ఉదయం టాటా ఏస్‌లో చంద్రాపూర్ జిల్లా మహంకాళి ఆలయ దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి రాత్రి స్వగ్రామానికి పయణమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున తలమడుగు మండలం సుంకిడి గ్రామ సమీపంలో గల పెట్రోల్ పంపు వద్ద ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ డ్రైవర్ గాదె పాండురంగ్ అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలవగా.. మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. బొలెరో వాహనం బోల్తా పడగా అందులోని డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

కుశ్నపల్లి ఎల్లమ్మ ఆలయంలో అఘోరా పూజలు


ఎల్లమ్మ తల్లి ఆలయంలో అఘోరా

నెన్నెల:మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామానికే చెందిన అఘోర హాజరై అమ్మవారికి పూజలు చేశారు. 8 ఏళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లిన ఆయన అఘోరాగా మారి రావడంతో అతనిని చూసేందుకు గ్రామస్తులు అధికంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తన స్వగ్రామంలో నిర్మించిన ఆలయానికి తన వంతుగా రూ.30 వేలు విరాళంగా అందించారు. కుశ్నపల్లి గ్రామం తాను మొదట హిమాలయాలకు వెళ్లానని, ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నానని పేర్కొన్నారు. గ్రామస్తులు అఘోరాకు పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంధ్య మహేశ్‌రెడ్డి, గుడిసెల నానాగౌడ్, బైరి మల్లాగౌడ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని బి-జోన్ శాంతినగర్ ప్రాంతానికి చెందిన ఆడెపు అనిత(40) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెంది అనితది నిరుపేద కుటుంబం. కుటుంబం గడవడానికి మహిళా సంఘంలో రుణం తీసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో వాటిని తీర్చలేదు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి అప్పులు తీరుస్తానని తల్లికి చెప్పి వెళ్లిన కొడుకు చాలా రోజులైనా అప్పులు తీర్చలేదు. మరోవైపు ఇంటికి కూడా రావడం లేదు. శనివారం రాత్రి కొడుకుకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరినా రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.